# మార్గదర్శి ★

రచన :
సియ్యాద్రి గురుమూర్తి

రెగులరుగా మా క్లాసుకి ఎటెండు అయే మా రత్నం వారం రోజులయినా కంట బడక పోవుటచేత వాళ్ల ఇంటికి వెళ్లి సంగతి ఏమిటో కనుక్కుందా మనుకున్నాను. కాని ఆ రత్నంతో కలసి తిరగవద్దని ఎన్నిమాట్లు చెప్పాలి అని మా వాళ్లు చెప్పిన సంగతి గుర్తుకువచ్చి మళ్లీ అగ్గిమీద గుగ్గిలము అవుతుందని ఒక భయం.

మా రత్నానికి ఎక్కడికన్నా వెడదాము తొందరగా పయనం కమ్మంటే టాయిలెట్ అయివచ్చేసరికి సుమారు ఒక గంట నిరీక్షించ వలసి వచ్చేది. స్నో, పౌడరులు, సువాసన తైలములు అంటే మా రత్నానికి చాలా ఇష్టం. ఇవన్నియు రుద్దుకుని దుస్తులు పలుమార్లు చూచుకునేసరికి గంట పట్టవచ్చు.

మా రత్నానికిఉండే దురలవాటును పోగొట్టి మంచి మార్గంలోకి తీసుకు వద్దామనే సదభిప్రాయం నాలో నాటుకునిఉంది. ఎలాగునైన ఆనాడు రత్నంతో కలసి తీరాలన్న నిశ్చయానికివచ్చి సూర్యాస్తమయపు వేళ బయలు దేరి వెళ్లాను. నేను వెళ్లేటప్పటికి కాఫీ సేవిస్తున్నాడు. బాగా చిక్కిశల్యమై ఉన్నాడు.

అయితే ఇంతకూ మీరత్నం మగవాడా అంటారేమొ? గుణ గణాలుకొన్ని ఆడవారికి చేరువలోవే అయినా మావాడు మగవాడులెండి. ఈ పేరేనేమిటి ఇటువంటి తికమక పర్చే పేర్లు ఎన్నో ఉన్నాయి ఆడవాళ్ళకు మగవాళ్లకుకూడా. ఉన్నాయికాని మగవాళ్లకే ఎక్కువ ఉన్నట్లు ఉన్నాయి.

ఏమిట్రా ఈ అవతారం అన్నాను. చెప్తావుండు ముందుకొంచెం కాఫీ తీసుకోఅంటూ నాకోగ్లాసు కాఫీ అందించాడు. కాఫీ పుచ్చుకున్నాక ఇరువురమూ కలసి అలా పార్కులోకివెళ్లి పచ్చని పచ్చికపై కూర్చున్నాము.

రత్నం ఇలా చెప్పడం ప్రారంభించాడు. గత ఆదివారం లైటుహౌసులో "World Beauty" చూడటానికని బయలు దేరాను. కొంతదూరం వెళ్లేసరికి నాకు ముందుగా ఇద్దరు వయసు మళ్లిన స్త్రీలమధ్య నడచుచున్న ఒక నవవ్వని నన్నిట్టే ఆకర్షించింది. ఆమెసన్నని నడుము వల్ల ఆఎత్తైన పిఱుదులచలనము హంసను ధిక్కరిస్తూఉంది. కాళ్లనున్న ఎత్తు మడమలజోడు ఆనడకకు నాందిగాఉంది. తెల్లని మైసూరు సిల్కుచీరయు ఎఱ్ఱని రవికెధరించియున్నందున ఆమె పచ్చని శరీరచ్ఛాయ ఆ సాయంకాలమున వెన్నెల ప్రసరిస్తుందనిపిస్తుంది. నల్ల తుమ్మెదను బోలు వంకరలు తిరిగియున్న ఆమెకురులకు రెండుజడలు వేయబడి మెడకు చెరియొక వైపు నల్లత్రాచుల్లాగ ముందుకు వేయబడి ఉన్నవి. ఆరెండు జడలపైని అర్థచంద్రాకృతిగా అమర్చబడ్డ రెండు మల్లెదండల నుండియు విరజిమ్ముతున్న సువాసన ఆ మందమారుతంలో నన్ను మత్తెక్కిస్తున్నాయి. వెనుకకు ఇట్టి ఆకర్షణ శక్తికలిగి యున్నటువంటి ఆ సుందరాంగి వదనారవిందము వీక్షించనిదే—ఉండలేక పోయాను. నడకను హెచ్చించి వెనుతిరిగి చూడకుండా చాలాముందుకు నడిచిపోయాను. ఇప్పుడు ఎదురుగావెళ్లి ఆమె అందాన్ని తనివితీరా తిలకించవచ్చు ననుకున్నాను. ముడతలు పడ్డ దుస్తులను దుమ్ము దులిపి సవరించుకున్నాను. కాలరుపైకి ఎత్తి స్టయలుగా నడుస్తూ ఆమెకెదురైయ్యాను. ఇంకేముంది భూమికంపించి నట్లయింది. కళ్లు చీకట్లుక్రమ్మాయి. తల తిరిగిపోయింది. గుండెదడ ప్రారంభించింది. ముందుకి అడుగువేయలేక చేరువనే ఉన్న విద్యుద్దీప స్థంభాన్ని అనుకుని నిలుచుండి పోయాను అని తన రెండు చేతులతోనూ కండ్లుమూసుకున్నాడు.

మా రత్నానికిఉండే దురలవాటు ఏమిటో ఇప్పుడు అర్థమయిందనుకుంటాను. అదే ఆడవాళ్లను వెంబడించటం. ఏ ఆడదన్నా కాస్తసింగారించుకొని మావాడికంట బడటమే తరువాయి; ఆమెను వెంబడించాడన్నమాటే. ఈ అలవాటులో తనుతిన్న చీవాట్లకు చెంపదెబ్బలకు లెఖ్ఖలేదు. ఆడవాళ్లేనేమిటి మగవాళ్ల విషయంలో చూసారు. వాడి మాదిరిగానే ఫుల్ ఫేంటు తొడుక్కొని ఇన్‌సర్టుచేసి ఎత్తుక్రాపు దువ్వుకున్న ఒక ఆసామి కనుపించాడనుకోండి. ఈయన గారిపేంటు సరిగ్గా ముడ్డిమీద కట్టబడి ఉందే క్రిందకుకూడా పిక్కలవఱకూ మడచిఉందే. ఆ నున్నగాఉన్న తలమీద ఒకే ఒకవంకర ఎలావచ్చింది చెప్మా. ఆ ఏముంది దువ్వెనతోగట్టిగా నొక్కుకుని ఉంటాడు. అని తనలోతానే సర్దుకుంటాడు. ఇవి మా వాడిఅలవాట్లు.

కొన్ని క్షణాల తరువాత మళ్లీ ఈ విధంగా చెప్పడం మొదలు పెట్టాడు. ఆమెవెనుకకు ఎంత ఆకర్షవంతంగా ఉందో ఆమె ముఖము అంతవికృతంగాఉంది. నల్లనిలావుపాటి పెదిమలు అందులోనుండి ఎత్తుగాబయటపడ్డ తెల్లని పలువరుస ఆ తెలుపుకుతోడు పెద్దవిగానున్న తెల్లనిగ్రుడ్లు. చూపుకు ఎంత భయంకరంగా ఉన్నదో చెప్పలేను నిజముగా మానవాకృతి గలిగిన రాక్షసియని చెప్పవచ్చు. ఆనాడు మొదలుకొని నిన్నటివఱకు తీవ్రమైన జ్వరము, రాత్రులయందు భయంకరమైన అరుపులు అరచేవాడంట. మా అమ్మ ఈవారం రోజులు ఎంత అవస్తలకు లోనయిందో ఆముఖమే చెపుతూవుంది. మందుల శక్తివల్లను, మంత్రాల మహిమవల్లను ఈ విధంగా తేరుకున్నట్లు అమ్మ చెప్పింది. వేళయింది అమ్మనాకోసరం చూస్తుంటుంది వెల్దాము పద అన్నాడు. వాడ్ని ఇంటివఱకు సాగనంపి నేను మాయింటికి చేరుకొన్నాను కాని ఆరూపసి ఎవరా అన్నఆలోచనే నాకూ కలిగింది. మరునాడు ఆరాతీయగా క్రొత్తగా మావూరు బదలీ అయివచ్చిన హెడ్ గుమస్తా వెంకట్రామయ్యగారి ఏకైక పుత్రిక చంద్రముఖి...అని తెలుసుకున్నాను

ఏమైనా కానివ్వండి ఆమెవల్లనే నా ప్రియమిత్రుడు నేడు నిజముగా ఒక వెలలేని రత్నంగా మారిపోయాడు. ఆమెను అభినందించకుండా ఉండలేను. ★